

చొల్లంగి తీర్థానికి
పోటెత్తిన భక్తజనం - 7వ
సచివాలయ ఉద్యోగులపై దాడి - 7వ
చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం - 7వ



కాకినాడ మెయిన్‌లైన్..
ఇక కలేనా?

కాకినాడ మెయిన్‌లైన్ ఇక కలగానే మిగలనుందా. జిల్లావాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రతిపాదనలు కోల్డ్ స్టోరేజీకి చేరుకున్నాయా. అంటే అవుననే సమాధానం వస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో వరుసగా రెండో ఏడాది రూ.వెయ్యి మాత్రమే కేటాయించడం ఇందుకు అద్దం పడుతోంది. ఈ లైన్ గురించి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కేంద్రం దీన్ని పట్టాలు తప్పించినట్లు చెప్తున్నారు.

- కేంద్ర బడ్జెట్‌లో మరో మారు మొండిచేయి
- రూ.వెయ్యే కేటాయింపు
- రూ.45కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లకు చేరిన అంచనా వ్యయం
- కోల్డ్‌స్టోరేజీలోనే ప్రతిపాదనలు

పిఠాపురం, ఫిబ్రవరి 9: అది దశాబ్దాల కల. ఎంతో చరిత్ర కలిగి ఒకప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి, నేడు కాకినాడ జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న కాకినాడ నగరాన్ని రైల్వేల పరంగా విశాఖపట్టణం-విజయవాడ మెయిన్‌లైన్‌లో కలపాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా ఉంది. పోర్టు ఉండి పారిశ్రామికంగా అన్నిరకాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న కాకినాడకు ప్రధాన రైల్వేలైను లేకపోవడం ఒక్కటే లోటుగా మిగిలింది. ప్రస్తుతం సామర్లకోటనుంచి కాకినాడకు ప్రత్యేక రైలు మార్గం ఉంది. విజయవాడ, విశాఖ వైపుల నుంచి వచ్చే ప్రయాణికులు సామర్లకోటలో దిగి కాకినాడ మార్గానికి మారాల్సి ఉంటుంది. దేశంలో ప్రధానమైన ప్రాంతాలకు వెళ్లే రైళ్లు కాకినాడనుంచి లేకపోవడంతో సామర్లకోట లేదా రాజమహేంద్రవరం, విశాఖపట్టణం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఉంది.

కాకినాడ మెయిన్‌లైన్ ప్రతిపాదనలు ఇలా..

విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్‌లోకి కాకినాడను తీసుకువచ్చేందుకుగాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకొంటూ ప్రస్తుతం ఉన్న సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలని ప్రతిపాదించారు. పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో లేదా పూర్వ చిత్రాడ రైల్వేగేటు దాటిన తర్వాత చంద్రపాలెం సమీపంనుంచి కాకినాడ రైల్వేలైనును తీసుకువెళ్లేందుకు సర్వే జరిగింది. 21.5 కిలోమీటర్ల ఉండే ఈ లైనుకు తొలుత రూ.48కోట్లు ఉన్న అంచనాలు 2014-15లో రూ.220.30కోట్లకు చేరుకున్నాయి. 2017-18లో ఇది రూ.350కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణలోకి తీసుకుంటే ప్రస్తుతం ఇది రూ.వెయ్యి కోట్లకు చేరుకుందని చెబుతున్నారు.

గతంలో పుష్కలంగా నిధులు

కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండడం, అందులో భాగస్వామిగా టీడీపీ ప్రభుత్వం ఒత్తిడితో కాకినాడ మెయిన్‌రైల్వే లైనుకు 2016-17 రైల్వేబడ్జెట్‌లో రూ.50కోట్లు, 2017-18 బడ్జెట్‌లో రూ.150కోట్లు కేటాయించారు. ప్రాజెక్టు వ్యయంలో కీలకమైన భూసేకరణవ్యయాన్ని భరించేందుకు అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అంగీకారం తెలపడంతో రైల్వేలైను పనులు ప్రారంభమవుతాయని ఆశించారు. సమగ్ర సర్వేతోపాటు అంచనాలు రూపొందించిన తర్వాత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, భూసేకరణ వ్యయం భరించడంపై వెనక్కి తగ్గడంతో ఈ ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమయ్యాయి.

వరుసగా రెండో ఏడాది అంతే

కాకినాడ మెయిన్‌లైన్‌పై రాష్ట్ర ప్రభుత్వంనుంచి ఒత్తిడి లేకపోవడం, వైసీపీ ప్రజాప్రతినిధులు అంతగా దృష్టిసారించకపోవడంతో కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడం లేదు. ఐదు బడ్జెట్‌లు గా నామమాత్రంగా నిధులు ఇస్తున్నారు. గత బడ్జెట్‌లో రూ.వెయ్యి ఇచ్చినట్లు చూపిన కేంద్రం, ఇప్పుడు వరుసగా రెండోఏడాది రూ.వెయ్యి కేటాయించినట్లు చూపడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేంద్ర రైల్వేబడ్జెట్‌లో అంచనాలను మాత్రం పదేళ్ల క్రితం ఉన్నరూ.220కోట్లకే పరిమితం చేయడం గమనార్హం. నామమాత్రపు కేటాయింపులు జరపడంతో కాకినాడ మెయిన్‌లైన్ ఇక శాశ్వతంగా కోల్డ్‌స్టోరేజీకి వెళ్లిందాఅన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాటి నివేదికకే కట్టుబడిందా..

ఐదేళ్ల క్రితం రైల్వే బోర్డు కాకినాడ మెయిన్‌లైన్‌పై సర్వే నిర్వహించి ఇది ఆర్థికంగా ప్రయోజనకరం కాదని తేల్చింది. దీనిపై ప్రజాప్రతినిధులనుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కాకినాడలో పోర్టుతోపాటు పలు పరిశ్రమలు ఉన్నాయి. పెట్రో కారిడార్ ఈ ప్రాంతం మీదుగా వెళ్లడంతోపాటు కాకినాడ సెజ్‌లో పలు పరిశ్రమలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోర్టు ద్వారా భారీగా ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. విశాఖ-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో కాకినాడను కలపడం ద్వారా రైల్వే ద్వారా ఈ ఎగుమతులు, దిగుమతులు జరగడంతోపాటు వాణిజ్య, వ్యాపార అవసరాలకు అనువుగా ఉంటుంది. ఈ ప్రయోజనాలను రైల్వేశాఖ పట్టించుకోకపోడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం గట్టి ఒత్తిడి తెస్తేనే కాకినాడ మెయిన్ లైన్ కల నెరవేరుతుందని, లేకుంటే ఇది ప్రతిపాదనలుగానే మిగిలిపోతుందని ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

తునిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు హాజరైన జనం





షర్మిలకు గజమాలతో స్వాగతం

ప్రజలను మోసం చేసేందుకే
జగన్ సిద్ధం

- రాష్ట్ర ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం
- జగన్ అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారు
- తునిలో వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

- 7వ

జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: సాగరమాల ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన జాతీయ రహదారుల పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికాశుక్లా.. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, ఎన్‌హెచ్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, ఇరిగేషన్, డ్రెయిన్స్, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ప్రణాళికల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌నుంచి యాంకరేజ్ పోర్టు వరకు, అన్నవరంనుంచి వాకలపూడి వరకు జాతీయ రహదారి ప్రాజెక్టులకు సంబంధించి డ్రెయిన్ల అవుట్‌లెట్‌లు, కల్వర్టులు, ఫ్లైఓవర్ వంతెనలు, రైల్వేక్రాస్లు, అప్రోచ్ రహదారులు, పైపు లైన్లు తదతర పనులకు సంబంధించిన వివరాలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో కాకినాడ గ్రామీణం, పట్టణ ప్రాంతాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా, సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాయుతంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, ఎన్‌హెచ్ఏఐ పీడీ సురేంద్రనాథ్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కుడా వీసీ పి.కృష్ణమూర్తి, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సర్వే అధికారులు పాల్గొన్నారు.

నిర్బంధాన్ని నిరసిస్తూ..
ప్రభుత్వ కార్యక్రమాల బహిష్కరణ



కాకినాడ మశీదు సెంటర్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

- జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆశావర్కర్ల నిరసనలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: ఛలో విజయవాడ ధర్నా సందర్భంగా ఆశాకార్యకర్తలపై జగన్మోహనరెడ్డి ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధాన్ని విధించడంపట్ల నిరసనగా రెండు రోజులపాటు ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాకినాడలో ఆశావర్కర్లు ప్రభుత్వ కార్యక్రమాలు శుక్రవారం బహిష్కరించారు. ఈ సందర్భంగా కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి బాలాజీ చెరువు సెంటర్ మీదుగా మశీదు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, రామారావుపేట పీహెచ్‌సీ నాయకురాలు రెడ్డిసత్యవతి, కాకినాడ నగర కార్యదర్శి మద్దెల భారతిప్రియ ప్రసంగించారు. ఆశావర్కర్ల నిర్బంధం ద్వారా జగన్‌రెడ్డి తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని విమర్శించారు. మహిళా సాధికారిత అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వం పోలీసులతో చేసిన సత్కారానికి రాబోయే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటామని ప్రకటించారు. యూనియన్‌నాయకురాళ్లు, సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి సందడి



రత్నగిరిపై వివాహాల సందడి(ఫైల్ ఫోటో)

- రేపటి నుంచి మాఘమాసం ప్రారంభం
- ఏప్రిల్ 26 వరకూ వివాహాల కోలాహలం
- తిరిగి శ్రావణంలోనే ముహూర్తాలు
- ముందస్తుగా ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ బుకింగ్
- ఊపందుకోనున్న వ్యాపారాలు

పెద్దాపురం/అన్నవరం, ఫిబ్రవరి 9: జిల్లాలో వివాహాలు కోలాహలం ఆరంభం కానుంది. ఈనెల 11 నుంచి మాఘమాసం ప్రారంభమవుతుండడంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్ల జరిపించడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. మాఘమాసం నుంచి శ్రీక్రోధి నామసంవత్సర చైత్రమాసం వరకూ అంటే ఏప్రిల్ 20 వరకూ మూడునెలల్లో మంచి ముహూర్తాలున్నాయి. రెండు నెలలు విరామం అనంతరం మళ్లీ వివాహాలు మొదలు అవుతుండడంతో కల్యాణ మండపాలవద్ద పెళ్లి బృందాల సందడి మొదలుకానుంది. జిల్లావ్యాప్తంగా పలుప్రాంతాల్లో మూడు ముళ్లతో వందల సంఖ్యలో నవజంటలు ఒక్కటి కానున్నాయి. ఇందుకు అనుగుణంగా యువతీ, యువకులు తల్లిదండ్రులు ముందస్తు పెళ్లి పనుల్లో బిబీబిజీగా మారిపోయారు.

శుభ ఘడియలు ఇవే..

వివాహానికి యోగ్యమైన ముహూర్తాలను పండితులు సూచిస్తున్నారు. మాఘమాసం ప్రారంభం తదుపరి ఈనెల 13వ తేదీ, 14, 17, 18, 24, 28, 29 తేదీల్లో ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. వచ్చే 2, 3వ తేదీల్లో సైతం వివాహాలు జరిపించుకునే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఫాల్గుణ మాసం మార్చి 15న, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్‌లో 3, 4 తేదీలు వివాహ ముహూర్తాలున్నాయని అంటున్నారు. దీంతోపాటు చైత్రమాసమైన ఏప్రిల్లో 9వ తేదీ, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీల్లో వివాహాలు జరిగే అవకాశాలున్నాయని పండితవర్గాలు అంటున్నాయి. ఏప్రిల్ 28వతేదీ నుంచి మూఢం ప్రారంభం కానుంది. తిరిగి శ్రావణమాసం వరకూ అంటే ఆగస్టు వరకూ వివాహ మూహూర్తాలు లేవని పురోహితులు వివరిస్తున్నారు.

ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ ముందస్తు బుకింగ్..

జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనుండడంతో తల్లిదండ్రులు ముందస్తు పనులపై దృష్టిసారించారు. ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీహాళ్ల క్యాటరింగ్, పురోహితులు, బాజాభజంత్రీలు, ఆర్కెస్ట్రా, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, ట్రావెల్‌కార్లు ఇలాపెళ్లికి అవ సరమైన వాటిని ముందస్తుగా బుక్ చేసుకోవడంపై దృష్టి సారించారు. వివాహాలకు అవసరమైన పట్టు వస్త్రాలు, బట్టలు, బంగారు ఆభరణాలు ముందస్తు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో షాపింగ్‌మాల్స్, బట్టల దుకాణాలు, జ్యువెల్లరీ, డ్రెసెస్, లేడీస్ ఎంపోరియంలు, ఫ్లవర్ డెకరేటర్స్ ఇలా పలు వ్యాపారాలు పుంజుకోనున్నాయి. వివాహాల సీజన్‌లో జిల్లా మొత్తంగా రోజుకు రూ.కోటినుంచి రూ.3కోట్ల వరకూ వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వ్యాపారవర్గాలు అంచనా వేస్తున్నారు.

మూడు నెలల్లో 30 ముహూర్తాలు

ఈఏడాది వివాహ ముహూర్తాలు తక్కువగానే ఉన్నాయని పురోహితులు చెప్తున్నారు. మాఘమాసం ప్రారంభమవుతున్న ఈనెల 11వ తేదీనుంచి శ్రీక్రోధ నామ సంవత్సరం చైత్రమాసం వరకూ అంటే ఏప్రిల్ 26వ తేదీ వరకూ మూడునెలల్లో 30 వివాహ ముహూర్తాలు మాత్రమే ఉన్నాయంటున్నారు. ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం కానుంది. దీంతో వైశాఖం, జేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని పంచాంగ కర్తలు వివరిస్తున్నారు. ఆ తర్వాత ఆషాఢం శూన్యమాసం కావడంతో శుభ కార్యాలకు పనికిరావని, మళ్లీ శ్రావణ మాసం అంటే ఆగస్టు నుంచి తిరిగి వివాహాలు జరిపించుకోవచ్చని పురోహితులు చెబుతున్నారు.

రత్నగిరిపై రిజర్వేషన్‌లు

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది అంటే సత్యదేవుడి సన్నిధి ఎక్కడా ఖాళీ ఉండదు. మాఘమాసం పెళ్లిళ్లకు ఇప్పటికే పెండ్లి బృందాలు కల్యాణమండపాలను ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారు. అన్నవరం కొండపై వివాహాలు చేసుకునేందుకు వీలుగా 24 ఉచిత కల్యాణవేదికలు, 36 హాళ్లతోపాటుగా సీతారామసత్రం, పాత, కొత్తసెంటినరీ కాటేజీలు, రామాలయ ప్రాంగణంలో వివాహాలు జరుగుతాయి. వివాహ ముహూర్తాలు అధికంగా ఉండడంతో పురోహితులు, భజంత్రీలు, క్యాటరింగ్, పూలడెకరేషన్ మండపాలకు విశేష డిమాండ్ నెలకొంది.

ఇళ్ల పట్టాలు ఇచ్చారు..
స్థలాలు చూపించలేదు..



కలెక్టరేట్‌లో ఇళ్లపట్టాలు చూపుతున్న పట్టాదారులు

- అధికారులకు వీకే రాయపురం గ్రామస్థుల మొర

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: నాలుగేళ్ల క్రితం ఇళ్ల పట్టాలు ఇచ్చారు.. ఇంతవరకు స్థలాలు చూపించలేదు.. ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకోమంటూ అధికారులు హడావుడి చేస్తున్నారని సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామస్థులు వాపోయారు. తమకు నివాసయోగ్యమైన స్థలాలు చూపించి రిజిస్ట్రేషన్‌లు చేయాలని శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులకు మొరపెట్టుకున్నారు. 2020లో ఇచ్చిన ఇళ్లపట్టాలకు ఇంతవరకు స్థలాలు చూపించలేదన్నారు. ఊరి చివర ఎక్కడో నివాసయోగ్యానికి అనువుగా లేనిచోట స్థలాలు ఉన్నాయని చెప్తూ రిజిస్ట్రేషన్ చేయించుకోమని అధికారులు చెబుతున్నారన్నారు. ఇళ్లపట్టాల్లో చూపిన హద్దుల ప్రకారం రిజిస్ట్రేషన్ చేస్తామని అధికారులు చెప్తున్న స్థలంలోకి వెళ్లడానికి కనీసం దారిమార్గమైనా లేదన్నారు. ఏలేరుకు గండి పడితే ఈ ప్రాంతమంతా మునిగిపోతుందని, తాము బయట పడేందుకు దారి కూడా ఉండదన్నారు. నివాసానికి అనుకూలంగా ఉన్న స్థలాలిచ్చి తమకు న్యాయం చేయాలని మహిళలు కోరారు.

జిల్లాలో 4,28,159మందికి మాత్రలు: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 9: నలుపురుగుల దినోత్సవం సందర్భంగా కాకినాడ ఏఎఫ్‌సీ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేసి మింగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఏడాది నుంచి 19ఏళ్లలోపు బాలబాలికలు 4,61,684మంది ఉన్నారని, శుక్రవారం అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్, కాలేజీల్లోని 4,28,159మందికి 92.7శాతం మేర ఆల్బెండోజోల్ మాత్రలు వేశామన్నారు. మిగిలినవారికి ఈనెల 16న వేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ, జిల్లా క్షయ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత, డీపీఎంవో డాక్టర్ సురేఖ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

సీఎం ముఖ్య సలహాదారును కలిసిన కలెక్టర్, జేసీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అజయ్ కల్లమ్‌ను కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ప్రవీణ్ ఆదిత్య మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కాకినాడ విచ్చేసిన ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం డీఈవోగా పనిచేస్తూ బదిలీపై కాకినాడ డీఈవోగా బాధ్యతలు చేపట్టిన పిల్లి రమేష్ శుక్రవారం కలెక్టర్, జేసీలను కలిశారు.

ఊడి బయటకు వచ్చిన ఆర్టీసీ బస్సు చక్రాలు

- సామర్లకోట-కాకినాడ రోడ్డులో తప్పిన పెను ప్రమాదం



వీకే రాయపురం వద్ద బయటకు ఊడి వచ్చిన బస్సు చక్రాలు

సామర్లకోట, ఫిబ్రవరి 9: సామర్లకోట-కాకినాడ ప్రధాన రోడ్డులో వెంకటకృష్ణరాయపురం సమీపాన సామర్లకోట వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు ఊడి బయటకు వచ్చాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సును రోడ్డు పక్కకు సురక్షితంగా చేర్చాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో 45మంది ప్రయాణికులు ఉన్నారు. కాకినాడనుంచి శాంతి ఆశ్రమం వెళ్తుండగా వీకే రాయపురంవద్ద భారీగోతులను దాటించే ప్రయత్నంలో ఈ సంఘటన జరిగింది. అదే సమయంలో వెనుక ఆటోలో 15మంది విద్యార్థులు వస్తుండగా బస్సును ఆటోడ్రైవరు గమనించి వెనుక ఆగిపోయాడు. సామర్లకోట- కాకినాడ ప్రధానరోడ్డులో సగం మాత్రమే మరమ్మతులు నిర్వహించగా మరో 8కిలోమీటర్ల మేర గోతులను పూడ్చకుండా వదిలివేయడంవల్లే నిత్యం వాహనాలుప్రమాదాలకు గురవుతున్నాయి. పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి వాహన రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

భేష్... భళా... సూపర్!



సెమినార్‌లో మాట్లాడుతున్న సీఎం సలహాదారు అజేయ్‌కల్లం

- వర్సిటీ వేదికగా వైసీపీ స్కీమ్‌లపై భజన
- జగన్ పథకాలపైనే ప్రత్యేకంగా సెమినార్
- జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- సీఎం ముఖ్య సలహాదారు అజేయకల్లం తదితరుల హాజరు
- విద్యార్థులు బయటకుపోకుండా ఆడిటోరియానికి తాళం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 9: జగన్ పథకాల ప్రచారానికి చివరకు విశ్వవిద్యాలయాలనూ వదిలిపెట్టడం లేదు. భేష్.. భళా.. సూప ర్.. ఇదీ ఈ 'ప్రచారం'లో పాల్గొన్న వక్తల వరుస. కాకినాడ జేఎన్‌టీయూకేలో 'సంక్షేమం, అభివృద్ధి, సమ్మిళిత పాలన, ప్రగతి పథం లో ఆంధ్రప్రదేశ్' అనే అం శంపై ఓపెన్ మైండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. పరీక్షలు, ప్రాజెక్టు వర్క్‌లు, పుస్తకాలతో కుస్తీ పట్టే ఇంజనీరింగ్ విద్యార్థులను బలవంతంగా సెమినారులో కూర్చోబెట్టారు. ప్రభుత్వ ప్రచార తంతులా ఈ కార్యక్రమం సాగింది. ప్రభుత్వ పథకాలను విద్యార్థులకు వివరించి వారిలో వైసీపీపై సానుకూలత ఏర్పడేలా చేయాలని ప్రయత్నించారు. ఈ కార్యక్రమానికి ఓపెన్ మైండ్స్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా మాజీ సీఎస్, సీఎం ముఖ్య సలహాదారు అజేయకల్లం, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఆదిత్య ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, రెక్టార్ కేవీ రమణ పాల్గొన్నారు. అజేయకల్లం తన ప్రసంగంలో నాడు-నేడు, అమ్మఒడి, విదేశీ విద్యాదీవెన, రీసర్వే, ఏపీల్యాండ్ టైట్లింగ్ చట్టం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ఏకరువు పెట్టారు. విద్యార్థులంతా వీటన్నింటిని అమలు చేస్తున్న ప్రభుత్వం గురించి ఆలోచించాలన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ....వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. శేషారెడ్డి మాట్లాడుతూ... ఇంగ్లీష్ మాట్లాడలేకపోవడమే విద్యార్థుల ఓటమికి ప్రధాన కారణమన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదువులతో ప్రపంచం మనదవుతుందని తెలిపారు. ఈ దిశగా జగన్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వ్యాఖ్యానించారు. వర్సిటీ ప్రొఫెసర్ మురళీకృష్ణ.. అతిథులను పొగడ్తలతో ముంచెత్తారు. విసుగు చెందిన కొందరు విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆడిటోరియం తలుపులు మూసివేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించిన సమాచారంతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వాటిపై ఎవరు ముద్రించారో వారి పేరు కానీ, చిరునామా కానీ, ఫోన్ నెంబరు కానీ లేకపోవడం గమనార్హం.

చొల్లంగి తీర్థానికి

పోటెత్తిన భక్తజనం

సంగమేశ్వరస్వామికి పూజలు

ఆకట్టుకున్న కోల సంబరం





పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

కరప, ఫిబ్రవరి 9: పురాణ ప్రాశస్త్యం కలిగిన చొల్లంగి అమావాస్య తీర్థానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కరపమండలం ఉప్పలంక శివారు మొండి గ్రామం విచ్చేసి సముద్ర తీరాన కొలువుదీరిన బాలాత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి సముద్ర స్నానాలాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొల్లంగిలోని రాజరాజేశ్వరిదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారామాంజనేయ స్వామివార్లను కూడా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప, తాళ్లరేవు, కాజులూరు తదితర మండలాల నుంచి వీరభద్రుని ప్రభలు, గరగలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే అప్పన్నెద్దులను కోల సంబరం పాటలు, నృత్యాలతో తోలుకువచ్చి సముద్ర స్నానాలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, దేవదాయశాఖ సిబ్బంది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను, వైద్యసేవల కోసం శిబిరాన్ని, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, ఇంద్రపాలెం, గొల్లపాలెం, కాకినాడ పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీతో యానాం జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలను మళ్లించారు. జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ పి.బాబూరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, ఎంపీటీసీ కాలాడి కామేశ్వరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

బ్రహ్మసమేధ్యం..భక్త జనసంద్రం



స్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న జనం

కాట్రేనికోన, ఫిబ్రవరి 9: చొల్లంగి తీర్థానికి అధిక సంఖ్యలో భక్తులు గురువారం రాత్రికే బ్రహ్మసమేధ్యం చేరుకున్నారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు ఆలయ ఆవరణలో నిద్రించారు. వేకువజామున భక్తులు సముద్రంలో స్నానాలాచరించారు. బ్రహ్మేశ్వరస్వామి, కాలభైరవుడు, వినాయకుడు, కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పల్లం శ్రీకాల భైరవస్వామి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, వైసీపీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, పల్లం సర్పంచ్ మల్లాడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అధికారుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథరాజు

అన్నవరం, ఫిబ్రవరి 9: రీజనల్ జాయింట్ కమిషనర్ కేడర్ కలిగిన అన్నవరం దేవస్థానంలో ప్రస్తుతం అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ ఈవో బాధ్యతలు నిర్వహిస్తుండగా తాజాగా అన్నవరం దేవస్థానానికి డిప్యూటీ ఈవోగా డిప్యూటీ కమిషనర్ కేడర్ అధికారి ఎస్.చంద్రశేఖర్‌ను దేవదాయ శాఖ కమిషనర్ నియమించారు. తక్షణమే విధుల్లో జాయిన్ కావాలని ఆదేశించడంతో ఆయన హుటాహుటిన గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక సహాయ కమిషనర్‌గా తలుపులమ్మ లోవ ఈవో పి. విశ్వనాథరాజును నియమించడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం దేవస్థానంలో పూర్తిస్థాయి సహాయ కమిషనర్‌గా, లోవ దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా విశ్వనాథరాజు బాధ్యతలు నిర్వహించనున్నారు. ముందుగా స్వామిని దర్శించుకుని ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా దేవస్థానం ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

డబ్బు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి..

బాలికపై లైంగిక దాడి.. ఇద్దరు వీఆర్వోలపై పోక్సో కేసు

మరో ముగ్గురిపైనా.. నిడదవోలులో ఘటన

నిడదవోలు, ఫిబ్రవరి 9: డబ్బులిస్తామని చెప్పి ఇద్దరు వీఆర్వోలు ఓ బాలికను శారీరకంగా అనుభవించిన ఘటనపై పోక్సో చట్టం కింద శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన బాలిక(14) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో తెలిసిన వారింటికి వచ్చింది. ఆ బాలికకు డబ్బులు ఆశచూపి నిడదవోలుకు చెందిన షేక్ అఖిలాండేశ్వరి, బండారి లలిత, దాడిశెట్టి దుర్గారావు అనేవారు వ్యభిచార కూపంలోకి దింపారు. ఈ క్రమంలో నిడదవోలు మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న పార్ల వెంకట్రావు, ఇంజేటి చిట్టిబాబుల వద్దకు గురువారం రాత్రి దుర్గారావు బేరం మాట్లాడి బాలికను పంపాడు. ఆ బాలికను వారిద్దరూ గురువారం రాత్రి శారీరకంగా అనుభవించారు. తర్వాత బాలికను స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లో దింపేందుకు వీఆర్వో చిట్టిబాబు వెళ్లాడు. అక్కడ ముందుగా మాట్లాడుకున్న మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో వీఆర్వో చిట్టిబాబుపై దుర్గారావు, మరికొంతమంది దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో బాలిక ఫిర్యాదు మేరకు ఆమెను వ్యభిచార కూపంలోకి దింపిన ముగ్గురు దళారులతోపాటు, అత్యాచారం చేసిన ఇద్దరు వీఆర్వోలపై పోలీసులు పోక్సో తదితర చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అలాగే తమపై దాడిచేసి, డబ్బు లాక్కొని.. కులం పేరిట దూషించారంటూ వీఆర్వో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దుర్గారావుతోపాటు మరికొంతమందిపె కేసులు నమోదైనట్లు నిడదవోలు ఎస్‌ఐ పులపా అప్పారావు తెలిపారు.

గోడల మధ్య ఇరుక్కుని వ్యక్తి మృతి



యానాం, ఫిబ్రవరి 9: రెండు గోడల మధ్య ఇరుక్కుని ఓ వ్యక్తి మృతిచెందాడు. యానాం చింతావారి వీధికి చెందిన గీదా శివ సుబ్రహ్మణ్యం(38) తన గోడకు అనుకుని ఉన్న మరో గోడ మధ్యలో ఇరుక్కుని మృతిచెందాడు. అయితే శివకు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఇంట్లో ఒక్కడే ఉంటాడు. తరచూ మద్యం మత్తులో ఉంటాడు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో గోడపై కూర్చుని పడిపోయి ఇరుక్కుని ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే ఈ సంఘటన అర్ధరాత్రి 1 గంట నుంచి 2 గంటల మధ్యలో జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతి కష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

చాగల్లు, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. చాగల్లులో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి ఆమె విచ్చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాశం స్వాతి సహా పలువురు మహిళలు మాట్లాడుతూ ఇళ్ల స్థలం లేదని, వైసీపీ నాయకులు వారికి కావలసిన వారికి మాత్రమే స్థలాలు ఇస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిరుద్యోగి కార్తీక్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ అన్నారు కాని ఇంతవరకు నోటిఫికేషన్లు విడుదల కాకపోవడం వల్ల అర్హతకు సంబంధం లేని పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు సంఘం సభ్యులు జీవీ సుబ్బారావు, కంకటాల బుద్ధుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తానని, రైతులను, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం జగన్, స్థానిక ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాళ్లముడుగు కాలువ వంతెనను వెడల్పు చేయాలని, కాలువ పూడిక తీయాలని కోరారు. లారీ అసోసియేషన్ తరుపున పంగిడికి చెందిన పెదకాపు, ఎం.నాని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రావాలని ఎంతో చేశామని కాని ప్రభుత్వం ట్రాన్సుపోర్టు రంగంపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐదు లారీలను నడిపేవాళ్లమని, ప్రస్తుతం ఒక్కలారీ కూడా నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. లారీ యజమానులకు, డ్రైవర్లకు ప్రమాద బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నామన్నారు. దళిత సంఘం నాయకుడు చోళ్ల రాజు మాట్లాడుతూ దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్న వారికి ఉన్నత పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంఘం తరపున కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పింఛను సొమ్ము పెంచలేదని, వివిధ కారణాలు చూపిస్తూ రాష్ట్రంలో 96000 మంది పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. హోం మంత్రి సొంత నియోజకవర్గంలో జరుగుతున్న దాడులను ఆపలేని మంత్రి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పింఛన్లు పెంచాలని, రద్దు చేసిన వాటిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, ఉభయ గోదావరి జిల్లాల పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ, మండలాధ్యక్షుడు బి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, పి.మురళీకృష్ణ, ఎండీ అమర్‌జహబేగ్, ఎండీ రఫీయుల్లా బేగ్, గెల్లా భాస్కరరావు, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

మోసం చేయడానికే జగన్ 'సిద్ధం'

రాష్ట్ర ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

జగన్ అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారు

తునిలో ప్రభుత్వంపై ధ్వజమెత్తిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

తుని రూరల్, ఫిబ్రవరి 9: తునిలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి వైసీపీ ప్రభుత్వం జగన్ పాలనపై ధ్వజమెత్తారు. తుని నియోజకవర్గ కేంద్రమైన తుని పట్టణంలో రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిలుకోటి పాండురంగారావు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, తుని ప్రజలు షర్మిలకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకుని అక్కడ జరిగిన సభలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడారు. అమలు కాని హామీల కోసం మాట్లాడకుండా ముఖ్యమంత్రి ఇప్పుడు సిద్ధమంటూ ముందుకు వస్తున్నారన్నారు. దేనికి సిద్ధమో చెప్పాలని నిరుద్యోగులను మోసగించడానికి సిద్ధమా, పోలవరం పక్కన పెట్టడానికి సిద్ధమా, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేసినందుకు సిద్ధమా అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక హోదా ఊసే మరిచిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దొందూ దొందే అంటూ ఎద్దేవా చేశారు. నాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం 7 వేల డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తుంటే తాను అధికారంలోకి వస్తే 25 వేలు పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నిరుద్యోగులను నాలుగున్నరేళ్ల గాలిలో ఉంచి ఎన్నికల వేళ మెగా డీఎస్సీ కాస్త దగా డీఎస్సీగా మార్చి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.

రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ

దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యవసాయం పండగలా ఉండేదని రైతు రాజై ఉన్నాడన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలు, పంటనష్ట పరిహారం ఉండేదని, ఇప్పుడు నష్టపోయిన రైతులను పట్టించుకున్న వారే లేరని అన్నారు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తానని నిషేధించిన తర్వాతే ఓట్లు అడుగుతానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిస్సిగ్గుగా లిక్కర్ వ్యాపారం నిర్వహిస్తూ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు.

మంత్రి రాజా కాదు అనుభవించు రాజా

తునిలో జరిగిన సభలో స్థానిక మంత్రి రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజాపై షర్మిల తీవ్రంగా విమర్శలు చేశారు. పేరుకే రోడ్లు భవనాల శాఖా మంత్రి అని రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంటుందని విమర్శించారు. మంత్రి ఇతర రాష్ట్రాల మద్యాన్ని తెప్పించి వ్యాపారం చేస్తున్నారని, ఇసుక మాఫియా, గుట్కా వ్యాపారాలు దగ్గరుండి నడిపిస్తున్నారని విమర్శించారు. మంత్రి పేరు దాడిశెట్టి రాజా కాదని, అనుభవించు రాజా అని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి హామీ మేరకు తునిలో భారీ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిందని, ముంపునకు గురవుతున్న తాండవ నది రిటైనింగ్ వాల్ సమస్య దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ఉండి ఉంటే పూర్తయ్యేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గ సమస్యలపై ఇచ్చిన హామీలు పెడచెవిన పెట్టిందని బంగాళాఖాతంలో కలిపేస్తానన్న దివీస్ పరిశ్రమను ఇప్పుడు దగ్గరుండి ప్రోత్సహిస్తోందని, తాండవ రిటైనింగ్ వాల్ ఊసే మరిచిందంటూ విమర్శించారు.

స్టేట్‌బ్యాంకు చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం



గ్యాస్ కట్టర్‌తో లాకర్ల ధ్వంసం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ చోరీ ఘటనపై గాలింపులు చేపట్టారు. అలాగే ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు శుక్రవారం ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకుకు విచ్చేసి విచారణ చేపట్టారు. బ్యాంకులోని స్ట్రాంగ్ రూం లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో తెరిచిన వైనాన్ని ఆయన పరిశీలించారు. అలాగే బంగారం, నగదు ఏ మేరకు చోరీకి గురైందనే దానిపై బ్రాంచ్ మేనేజర్ కె. అశోక్ నాయక్, సిబ్బందిని ఆరా తీశారు. ఈ ఘటనలో ప్రధానంగా ఆరుగురు దుండగులు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. బ్యాంక్ చోరీకి పాల్పడే ముందు రెక్కీ కూడా నిర్వహించి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ వంటి సామగ్రితో చోరీకి పాల్పడి నలుగురు నిందితులు బయటకు సిలిండర్‌తో వెళుతున్న సీసీ ఫుటేజ్ దృశ్యాలు విడుదల చేశారు. చోరీకి పాల్పడిన ముఠా కారులో వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో దొరికాయి. ఈ చోరీకి పాల్పడిన దొంగల ముఠా అంతరాష్ట్ర దొంగల ముఠా నేరస్తులుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరకంచిలో చోరీకి పాల్పడిన నిందితుల కారు తెలంగాణలోని భద్రాచలంలో కనిపించినట్లు తెలిసింది. ఈ చోరీలో దొంగలు తెరిచిన రెండు లాకర్లలో రూ.27లక్షల నగదు, 25 బ్యాగుల్లో రూ.48 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నట్లు సమాచారం. శుక్రవారం బ్యాంక్ లావాదేవీలు నిలిచిపోయాయి. చోరీకి పాల్పడిన దుండగులు లోపల వైర్లు కట్ చేయడంతో సర్వర్‌లు పని చేయకపోవడంతో లావాదేవీలు జరగడానికి వీలు లేకుండా పోయింది. శని, ఆదివారాల్లో సర్వర్లు, ఇతర సాంకేతిక సమస్యలు పరిష్కరించి సోమవారం నుంచి బ్యాంకు లావాదేవీలు పునరుద్ధరించేలా బ్యాంకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బ్యాంకు లాకర్లలోని పెద్ద లాకర్ జోలికి దుండగులు వెళ్లకపోవడం వల్ల దాదాపుగా రూ.13 కోట్లు విలువైన బంగారు ఆభరణాలు దొంగల బారిన పడకుండా బయటపడ్డాయనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నగదు, ఆభరణాల చోరీకి గురవడంతో ఉత్తరకంచి బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. తాము భద్రపరుచుకున్న బంగారు ఆభరణాల పరిస్థితి ఏంటని బ్యాంక్ అధికారులను ఆరాతీయగా 10 రోజుల వరకు ఏమీ చెప్పలేమని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

విరాళాల వివరాలు ఇవ్వండి..

ద్రాక్షారామ ఈవోను ప్రశ్నించిన వైసీపీ నాయకులు, భక్తులు



ఈవోను ప్రశ్నిస్తున్న నాయకులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 9: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి రథ నిర్మాణానికి సంబంధించిన ఖర్చుకు సంబంధించి అలాగే విరాళాల వివరాలు ఇవ్వాలని వైసీపీ నాయకులు, భక్తులు ఈవో పి.టి.వి సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భీమేశ్వరస్వామివారి దేవస్థానం కార్యాలయానికి వైసీపీ నాయకులు దొంగ శ్రీధర్, అనిశెట్టి చంటి, వాసంశెట్టి సూరిబాబు, భక్తులు చక్కా సోమరాజు తదితరులు చేరుకుని ఈవోను స్వామివారి రథం నిర్మాణం, పూల డెకరేషన్‌కు లక్షలు ఖర్చు చేయడం, లక్షల రూపాయలతో డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేయడంపై ప్రశ్నించారు. స్వామివారికి టీటీడీ సమర్పించిన వస్త్రాలు ఏమయ్యాయని నిలదీశారు. రూ.90 లక్షలతో స్వామివారి రథం నిర్మాణం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేయించినట్లు చెప్పారని అలా అయితే భక్తుల నుంచి వసూలు చేసిన లక్షల రూపాయల విరాళాలు ఏమయ్యాయని ఈవోను ప్రశ్నించారు. దాతగా మంత్రి పేరుతో శిలాఫలకం వేయించారని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకంపై ఎందుకు వేయలేదని ప్రశ్నించారు.

అపోహతో ఆరోపణలు చేస్తున్నారు: ఈవో

కాగా ఈ విషయంపై ఈవో పి.టి.వి సత్యనారాయణ మాట్లాడుతూ రథం విషయంలో అక్రమాలు జరిగాయని అపోహతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు స్వామివారి రథం నిర్మాణానికి రూ.90 లక్షలు మంత్రి, అర్చకుల ద్వారా పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. మంత్రి స్వయంగా రూ.30 లక్షలతో కలప కొనుగోలు చేశారని, అర్చకులు సహకారంతో భక్తుల నుంచి రూ.28 లక్షలు విరాళాలు సేకరించి రథం నిర్మాణానికి ఇచ్చినట్లు చెప్పారు. రథం నిర్మాణం మంత్రి వేణు సహకారంతో జరిగిందని ఆయన పేరుతో చిన్నపాటి శిలా ఫలకం వేయించామని, ఇతర దాతల పేర్లు పురావస్తుశాఖ అనుమతి ఇచ్చిన అనంతరం శిలాఫలకం వేయిస్తామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులపై దాడి

పిఠాపురం, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా పిఠాపురంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల 11వ వార్డు సచివాలయ ఉద్యోగులపై శుక్రవారం దాడి జరిగింది. సచివాలయంలో కొన్ని రోజులుగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. సర్వర్‌లో తలెత్తుతున్న సమస్యలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఉదయం నుంచి వేచి ఉన్నామని, ఇంకెంత సమయం పడుతుందంటూ కాలనీకి చెందిన దండం గంగాభవానీ అనే మహిళ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సమయంలో సచివాలయ మహిళా పోలీసు సంధ్యారాణి ఆ మహిళను మందలించి సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. దీనితో గంగాభవానీ, మరోమహిళ, గంగాభవానీ బంధువు వచ్చి సచివాలయ ఉద్యోగులపై దాడికి పాల్పడ్డారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో వారికి గాయాలయ్యాయి. సచివాలయ ఉద్యోగులు పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని వివిధ వార్డు సచివాలయ ఉద్యోగులు వచ్చి సంఘీభావం తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం బెంగళూరుకు చెందిన కేపీ నాయుడు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన దేవస్థానం ఏపీఆర్వో ఎం.గణపతిరావుకు అందజేయగా ఆయన దాతను అభినందించి దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి వారి ప్రసాదాలు అందించారు.

పోక్సో కేసులో రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులోని నేరస్తుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 26న ఓ బాలిక కిరాణా దుకాణానికి వెళ్లగా అదే సమయంలో అక్కడ ఉన్న బొమ్మూరుకు చెందిన కె.సుధీర్ కుమార్(సిద్దు) తన బైక్‌పైకి ఆ బాలికను బలవంతంగా లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో బొమ్మూరు పీఎస్‌లోని అప్పటి ఎస్‌ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తర పున పీపీ పితాని శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, అప్పటి ఎస్‌ఐ శివాజీ తదితరులను ఎస్పీ జగదీశ్ అభి నందించారు.

పది కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఫిబ్రవరి 9: చింతూరు మండలం మోతుగూడెంలో పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సీలేరు నుంచి ద్విచక్ర వాహనం మీద హైదరాబాద్ వివేకానగర్‌కు పది కిలోల గంజాయి తీసుకు వెళ్తున్న కల్యాణ్‌కుమార్, నరేంద్రలను పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఎస్‌ఐ జి.గోపాలరావు తెలిపారు. ఎస్‌ఐ వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ సంస్కృతిని పరిరక్షించుకోవాలి

చింతూరులో రేల పండుం

ఆకట్టుకున్న నృత్యాలు



మాట్లాడుతున్న సున్నం వెంకటరమణ

చింతూరు, ఫిబ్రవరి 9: కాలక్రమంలో మరుగునపడుతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 2013 నుంచి రేల పండుంని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ చెప్పారు. చింతూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన జపాల్ సింగ్ ముండా కళా వేదికపై ముఖ్య అతిథిగా పాల్గొన్న సున్నం వెంకటరమణ మాట్లాడారు. ఐదో జాతీయ సాంస్కృతిక సంప్రదాయ సమ్మేళనం ఆదివాసీలు నిర్వహించుకోవడం, ఆ మేరకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ కళాకారులు పాల్గొని సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రాశ్చాత్య నాగరికత గుండంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు కొట్టుకుపోకుండా ఉండేందుకు, రానున్న ఆదివాసీ తరానికి ఆదివాసీ సంస్కృతిని గుర్తుచేయడమే ప్రధాన లక్ష్యంగా ఐదో రేల పండుంని నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. ముందుగా ఆదివాసీ పెద్దలు పాల్గొని ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూల దండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పెద్దలు సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఒడిసా, అసోం, తమిళనాడు, ఝార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ కళాకారులు పాల్గొని వారి వారి ప్రాంతాల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.

అధిక సంఖ్యలో మొబైల్ ఫోన్ల రికవరీ

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

అమలాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చాట్‌బాట్ సేవలను ప్రారంభించిన తర్వాత జిల్లాలో అత్యధికంగా మొబైల్ సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అమలాపురం పోలీసు క్వార్టర్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాట్‌బాట్‌లో భాగంగా ఐదో విడతగా రూ.26.62 లక్షల విలువైన 170 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 8న జిల్లాలో చాట్‌బాట్ సేవలను ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.1.08 కోట్ల విలువైన 674 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్పీ శ్రీధర్ అందజేశారు. సెల్‌ఫోన్లు రికవరీ చేయడంలో విశేషంగా కృషి చేసిన అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, క్రైమ్ సీఐ అబ్దుల్ సలాం, ఎస్‌ఐ ఎస్ఆర్ కిశోర్‌బాబు, ఏఎస్‌ఐ అయితాబత్తుల బాలకృష్ణ, హెచ్‌సీలు ఎంసీహెచ్ శేఖర్‌రాజు, కె.నాగేశ్వరరావు, కేవీ రమణ, ఎంవీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఎల్.శ్రీను, జి.కృష్ణసాయి, ఎం.హరిబాబు, బీడీవీ ప్రసాద్, డి.అర్జునరావు, ఎ.సుభాకర్, ఆర్ఎస్‌సీహెచ్‌వీఎన్ ప్రసాద్, కె.సతీష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 9: అమలాపురం మెయిన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఎదుట తెల్లవారుజామున 108 అంబులెన్సు వాహనం మితిమీరిన వేగంతో వచ్చి ట్రక్కు ఆటోను ఢీకొంది. ప్రమాదం ధాటికి విద్యుత్ స్తంభం సైతం విరిగి వాహనంపై పడింది. ఈ ప్రమాదంలో ఆటో నేరుగా కెనరా బ్యాంకు మెట్ల పైకి వెళ్లిపోయింది. ట్రక్కు ఆటోలో ఉన్న డ్రైవర్ జనుపల్లికి చెందిన ఏవీవీ సత్యనారాయణకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. అంబులెన్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

16 నుంచి బంగారుపాప ఉరుస్ ఉత్సవాలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని పొన్నాడ గ్రామంలో ఈనెల 16 నుంచి 18 వరకు బషీర్‌బీబీ ఔలియా అనే బంగారుపాప 69వ ఉరుస్ ఉత్సవాలను నిర్వహించనున్నట్టు స్థానిక మజావర్లు షేక్ బషీర్,షేక్ ఇమామ్‌వలీ తెలిపారు. పొన్నాడలో 18వ తేదీ ఆదివారం జరిగే బంగారుపాప గంధోత్సవంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే హిందూ,ముస్లిం భక్తులకు ఆలయప్రాంగణంలో వసతి సౌకర్యాలు కల్పించామన్నారు.

‘ఈకేవైసీ పూర్తి చేయాలి’

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 9: రబీలో సాగు చేసే పంటలను ఈక్రాప్‌లో నూరు శాతం నమోదు చేసి ఈకేవైసీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి సూచించారు. పిఠాపురం మండలం జల్లూరులో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీని ఆయన శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా గ్రూపులకే కాక, రైతులకు వ్యక్తిగతంగా పవర్‌టిల్లర్లు, ట్రాక్టర్ పనిముట్లు, ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు అందించాలన్న వినతులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. అనంతరం పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీలు పి.స్వాతి, పద్మశ్రీ, ఏవో అచ్యుతరావు, వీఏఏ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో ప్రత్యేక పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ఉపాలయాలను దర్శించయిన అనంతరం భీమేశ్వర స్వామి,బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. నందిమండపం వద్ద పండితులచే వేదస్వస్తి పలకగా ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సామర్లకోట పరిధి భీమవరం దాళ్వా వరి పొలాలను సందర్శించి అక్కడి రైతులతో సమీక్షించారు.

‘తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు’

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో రానున్న వేసవికి తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీ వెంకటచౌదరి తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం ప్లాంటును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. మోటార్ల పనితీరు, ఫిల్టర్ల కెపాసిటీ, తదితర అంశాలపై ఆరా తీశారు. అక్కడ ఉన్న తుప్పలను తొలగించాలన్నారు. చినజగ్గంపేట, కొడవలి, కేహెచ్‌పేట తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈఈలు అనంతరాజు, కె.శ్రీదేవి, ఏఈ గౌతు రమణ తదితరులు ఉన్నారు.

‘టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి’

తుని రూరల్, ఫిబ్రవరి 9: టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్యస్పష్టం చేశారు. తుని 23వ వార్డులో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో ప్రచారం చేపట్టారు. గడపగడపకు వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టో అంశాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మల్ల గణేష్, కుక్కడపు బాలాజీ, అల్లు రాజేష్, దంతులూరి శ్రీనివాసరాజు,కొచ్చెర్లపాటి అరవిందపాటి వర్మ తదితరులున్నారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి తాగు, సాగునీరు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, కిర్లంపూడి జడ్పీటీసీ తోట రవి, తోట గాంధీ, కోర్పు సాయితేజ, అడబాల వెంకటేశ్వరరావు, జీను మణిబాబు, వీరంరెడ్డి కాశీబాబు, అనుకుల శ్రీకాంత్, బుర్రి సత్తిబాబు, బస్వా చిన్నబాబు, తూము కుమార్, పైడిపాల సూరిబాబు, అడబాల భాస్కరరావు, కందుల విజయ్, కందుల వినయ్ ఉన్నారు.

రేపు ‘దళిత సింహగర్జన’

కోటనందూరు, ఫిబ్రవరి 9: రాజమహేంద్రవరంలో ఆదివారం మాజీ ఎంపీ హర్షకుమార్ నిర్వహించే దళిత సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని డీపీఐఎస్ అధ్యక్షుడు కడితి చిననూకరాజు కోరారు. కోటనందూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మండలం నుంచి భారీసంఖ్యలో దళితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అల్లు చంద్రరావు, ఎమ్మిలి రాజు, మేడికొండ నూకరాజు పాల్గొన్నారు.

అన్నవరం: రాజమహేంద్రవరంలో ఆదివారం దళిత సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని జైభీమ్ రాష్ట్ర అధ్యక్షుడు తంతటి అరుణకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సరమర్ల మదుబాబు, తాడి సింహాచలం, గోల్తి జాన్ పాల్గొన్నారు.

14న మహాకుంభాభిషేకం

జగ్గంపేట, ఫిబ్రవరి 9: జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేకం ప్రతిష్ఠ మహోత్సవం ఈనెల 14న జరుగతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. 11,12,13న జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దేశంలో 12 ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆ పీఠాల వద్ద ప్రాణ ప్రతిష్ఠ చేయించి పవిత్ర నది జలాలతో అభిషేకం చేయించి 14న ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ మహాయజ్ఞంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో కందుల చిట్టిబాబు, తోట రవి, తోట గాంధీ, సుంకవిల్లి రాజు, పైడిపాల సత్తిబాబు, సుంకవిల్లి వీర్రాజు, బొండా శ్రీనుబాబు, సుంకవిల్లి వీర్రాజు, గొల్లవిల్లి అప్పలరాజు ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

పిఠాపురం, ఫిబ్రవరి 9: పట్టణంలోని రాజావారికోటలో వర్మ యూత్ ఆధ్వర్యంలో 3రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ ఆడారు. ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులు తీసుకొచ్చి నిర్మాణాలు ప్రారంభించామని తెలిపారు. అందులోనే వాకింగ్ ట్రాక్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. వర్మ యూత్ సభ్యులు, టీడీపీ నేతలున్నారు.

‘అక్రమ తవ్వకాలపై దృష్టి’

పెద్దాపురం, ఫిబ్రవరి 9: రామేశంమెట్ట అక్రమ తవ్వకాలపై దృష్టి సారిస్తున్నట్లు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కొండ గుండ కథనంపై ఆయన స్పందించారు. మెట్టపై తవ్వకాలు సాగిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు పెనాల్టీ విధించామని తెలిపారు. ఈనెల 2న కూడా రెవెన్యూ, మైన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఎంతమేర అక్రమంగా తవ్వకాలు సాగించారు అనే విషయంపై ఆరా తీస్తున్నామని, అక్రమ తవ్వకాలపై చర్యలుతప్పవని ఆయన హెచ్చరించారు.

‘వాణిజ్య సముదాయాల నిర్మాణానికి సహకరించాలి’

పెద్దాపురం, ఫిబ్రవరి 9: ఏపీ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో భవనం ఎదుట వాణిజ్య సముదాయాల నిర్మాణానికి సహకరించాలని సంఘ అధ్యక్షుడు డీడీ సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సముదాయాల నిర్మాణానికి సంబంధించి అంచనాలను రూపొందించారని, త్వరలోనే నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్, కార్యదర్శి పి.కృష్ణ, సభ్యులు సీహెచ్.సత్యనారాయణ, టి.సాయిబాబా, షేక్ వహీదాభాను తదితరులు పాల్గొన్నారు.

‘పేదలను మోసం చేసిన వైసీపీ’

తాళ్లరేవు, ఫిబ్రవరి 9: జగనన్న ఇళ్ల పట్టాల విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పేదలను మోసం చేసిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సాదనాల రాజాజీ అన్నారు. ఆయన తాళ్లరేవులో మాట్లాడుతూ వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు అధికారులు కుమ్మక్కై లబ్ధిదారులను జంబ్లింగ్‌చేసి ప్రజాధనాన్ని దోచేశారని ఆరోపించారు. నివాస యోగ్యతలేని స్థలాల్లో పట్టాలిచ్చి చేతులు దులిపేసుకున్నారని, చొల్లంగిలో స్థానికులకు పట్టాలిచ్చేందుకు సంసిద్ధం చూపించడం ఎందుకని ప్రశ్నించారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కామేశ్వరరావు

పెద్దాపురం, ఫిబ్రవరి 9: పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది రాగం కామేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. కామేశ్వరరావుకు బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, లాల్‌సలామ్, యాత్ర 2

తిరుమల	:	యాత్ర 2
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	లాల్‌సలామ్
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	లాల్‌సలామ్

‘ప్రజలను పీడిస్తున్నారు’

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 9: పన్నుల పేరుతో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పరోక్ష పద్ధతిలో ప్రజలను పీడిస్తున్నారని జనసేన సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆరోపించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శశిధర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించండి

» ఆశాకార్యకర్తల ఆందోళనలు

» అధికారులకు వినతిపత్రాలు



పిఠాపురం ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

పిఠాపురం, ఫిబ్రవరి 9: తమ డిమాండ్లు, సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జిల్లాలో పలు చోట్ల ఆశాకార్యకర్తలు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తల ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సంఘీభావం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఆరోగ్యసేవలందిస్తున్న ఆశా కార్యకర్తలపై పనిభారం అధికమైనా జీతాలు మాత్రం పెంచడం లేదని వర్మ తెలిపారు. వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.10వేలు వేతనం ఇస్తూ వారిని సంక్షేమ పథకాలకు అనర్హులు చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆశాల డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. గొల్లప్రోలు, చేబ్రోలు పీహెచ్‌సీల నాయకులు డి.సత్యవతి, డి.దుర్గ, ఉమాదేవి, జి.ఇందిర నాగమణి పాల్గొన్నారు.

కిర్లంపూడి: ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన ఆశావర్కర్లను వెంటనే విడుదల చేయాలని కిర్లంపూడి బస్టాండ్ ఆవరణలో ఆశావర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఆశా వర్కర్ల మండలాధ్యక్షురాలు డీవీ రమణమ్మ, రత్నకుమారి, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ భాగ్యం, వై.నూకతర్నం, ఎం.ఆనందకుమారి తదితరులున్నారు.

కరప: కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలో మండల ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి రెడ్డి వెంకటలక్ష్మి మాట్లాడారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఆశావర్కర్ల సంఘం మండల ప్రతినిధులు కుంచే సత్య, పోలినాటి విజయకుమారి, పెదపూడి శివదుర్గ, ఆచంట వెంకటలక్ష్మి, శాంతికుమారి, గాదంశెట్టి దేవి, సూరంపూడి మహాలక్ష్మి పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య రీతిలో నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు వేధింపులు చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని, వాటిని ఆపాలని సర్పవరం జంక్షన్‌లో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు ఆందోళన చేశారు.

తాళ్లరేవు: తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశావర్కర్లు ధర్నా చేశారు. ఆశావర్కర్ల సంఘం కార్యదర్శి పెయ్యల అనంతలక్ష్మి ఇన్‌చార్జి తహశీల్దార్ ఎమ్.సూరిబాబుకు వినతిపత్రాన్ని అందించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీటీకి వినతి అందజేశారు. మంగా లక్ష్మికాంతం, అప్పలరాజు, పార్వతి, సత్య, వెంకటలక్ష్మి, భవాని, రమ్య ఉన్నారు.

శంఖవరం: శంఖవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద పీహెచ్‌సీ ఆశావర్కర్లు ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిని తహశీల్దార్‌కి అందజేశారు.

పెద్దాపురం: ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు లోవకుమారి, వరలక్ష్మీ తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాగరత్నం, సలోమణి, బాలామణి, రామలక్ష్మీ, తులసి, లావణ్య సీత, లక్ష్మీ, దుర్గ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలంటూ ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు.

గండేపల్లి: తమ డిమాండ్లు నెరవేర్చాలని ఆశావర్కర్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

తొండంగి: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహశీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

తుని రూరల్, ఫిబ్రవరి 9: ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ప్రజలు అప్రమత్తమై ఓట్లు వేయాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు స్పష్టం చేశారు. తునిలో శుక్రవారం జరిగిన షర్మిల సభలో ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్‌పై చూపిన ప్రేమ ఆప్యాయతలు షర్మిలపై చూపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగారావు, పీసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, నాయకులు జగతా శ్రీనివాస్, ఇంటి వీరభద్రరావు, గ్యాలెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన్ రిసార్ట్స్‌లో షర్మిల బస

తుని రోడ్ షోలో పాల్గొన్న ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నవరం వద్ద వన్ రిసార్ట్స్‌లో బస చేశారు. ఆమె తుని నుంచి నర్సీపట్నం వెళ్లాల్సి ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా వన్ రిసార్ట్స్‌కు చేరుకున్నారు. శనివారం ఉదయం 9గంటలకు రోడ్డు మార్గం గుండా తుని మీదుగా నర్సీపట్నం వెళ్లనున్నారు. మార్గమధ్యంలో ములగపూడిలో రచ్చబడ్డ కార్యక్రమానికి వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకోనున్నారు.

‘సరైన ప్రాతినిధ్యం కల్పించాలి’

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమవుతున్న రజక వృత్తిదారుల ఆస్తులకు రక్షణ కల్పించాలని, రజకులకు ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కాకినాడ సుందరయ్య భవన్‌లో సంఘం ఆరో జిల్లా మహాసభలు సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. రజక వృత్తిదారుల జెండాను ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు మడక రాజు, రజక నాయకులు కాకినాడ రామారావు, కె.నాగేశ్వరరావు, కె.మాణిక్యం, ఏవీడీ మెంటారావు, ఎం.ఈశ్వరరావు, గొల్తి సత్యనారాయణ, చోడవరపు సత్యనారాయణ, పోలేపల్లి నారాయణరాజు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 9: న్యాయపరమైన కోర్కెల సాధన కోసం జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్ల ఆందోళన శుక్రవారానికి 9వరోజుకు చేరింది. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థ, అధికారులపై ఉందన్నారు. ఆందోళన కారణంగా చర్చలు నిర్వహించేందుకు కాంట్రాక్ట్ సంస్థ తరపు నుంచి బిగంగరాజు, గోకాడ రాంబాబు, మోహన్ రాగా, వారితో శానిటేషన్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు చర్చించారు. జీతాల పెంపుదల, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల విషయంలో సందిగ్ధత నెలకొంది. వచ్చేవారంలో మరోసారి చర్చలు నిర్వహించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కోర్కెలు తీరేవరకు విధులకు ఆటంకం లేకుండా ఆందోళన కొనసాగించాలని నిర్ణయించినట్లు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు సీహెచ్ విజయ్‌కుమార్, జె.శేషు, రమేష్ తెలిపారు. ఎస్.వాసు, జె.లక్ష్మిప్రియ, బి.మంగతాయారు, కృష్ణవేణి, రమణమ్మ, శ్రీకాంత్ ఉన్నారు.

పోలింగ్‌స్టేషన్ల సందర్శన

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 9: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శుక్రవారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. జగన్నాథపురంలోని ముత్తానగర్, ఎస్ఆర్‌కే స్కూల్, ఉమెన్స్‌కాలేజీ, గర్ల్స్ హైస్కూల్, ఎంఎస్ఎన్ స్కూల్, ఆంధ్ర పాలిటెక్నిక్ ప్రాంతాల్లోని పోలింగ్‌స్టేషన్లను పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో వసతులు లేని పక్షంలో అందుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రత్యంగిర హోమం

అన్నవరం, ఫిబ్రవరి 9: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి పండితులు జపములు, పారాయణలు నిర్వహించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చండీహోమం నిలుపుదల

వనదుర్గ ఆలయంలో ప్రతి శుక్రవారం చేపట్టే చండీహోమం ఇకపై ఆరోజున పౌర్ణమి, అమావాస్య వస్తే నిలుపుదల చేసి కేవలం ప్రత్యంగిర హోమం మాత్రమే నిర్వహించాలని వైదికకమిటీ సూచించడంతో ఈవో ఆదేశాలు ఇచ్చారు.

మంత్రి జయరాం పూజలు

అన్నవరం, ఫిబ్రవరి 9: సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

జయహో బీసీ సభలో టీడీపీ నేతలు



సభలో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు

యండమూరు(కరప), ఫిబ్రవరి 9: తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం దక్కిందని, బీసీలకు టీడీపీ పుట్టినిల్లులాంటిదని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. కరప మండలం యండమూరులో శుక్రవారం మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, కాకినాడ రూరల్ పరిశీలకులు కుడిపూడి సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నులుకుర్తి, చప్పిడి మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. టీడీపీ సీనియర్ నేతలు పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసుదాసు, కటకంశెట్టి ప్రభాకర్(బాబి), మట్టా ప్రకాష్‌గౌడ్, జనసేన నేతలు పంతం సందీప్, బండారు మురళి, కరెడ్ల గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు సీఎం జగన్ చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయానికి బీసీ వర్గాలు సమష్టిగా ముందుకు రావాలని విజ్ఞప్తిచేశారు. బీసీ సంక్షేమ బ్రోచర్లను విడుదల చేసి చేతులు కలిపి సంఘటితంగా ముందుకు సాగుదామని ప్రతినబూనారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, నాయకులు నులుకుర్తి వీరన్న, పలివెల జానకిరామయ్య, తాటికాయల వీరబాబు, సర్పసిద్ధి ఏడుకొండలు, కాకర్లపల్లి చలపతిరావు, కొండా వినాయక్, ఎజ్జల బాబ్జి, బొంతు నాగేశ్వరరావు, ములసా బాబూరావు తదితరులున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



ప్రత్తిపాడు:టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ఏలేశ్వరం మండలం మర్రివీడు గ్రామంలో ప్రముఖ వైద్యులు విజయబాబు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారందరికీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సకిరెడ్డి ప్రభ ఉపసర్పంచ్ కలగా వీరబాబు, విద్యాకమిటీ చైర్మన్ ఎలుగుబంటి చినబాబు ఉన్నారు. ఓలిపల్లి శ్రీకాంత్, నీలి సత్యనారాయణ, కొప్పిశెట్టి సూరిబాబు, బుజ్జిరాజు, జాకోబు, సూది బూరయ్య, జ్యోతుల పెదబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మందపాటి అలార్కరాజు, ఎస్‌జీవీ సుబ్బరాజు, చిక్కా లక్ష్మణరావు, కొప్పుల బాబ్జి, పలివెల శ్రీనివాస్, బస్వా ప్రసాద్, పెంటకోట శ్రీధర్, మైదాన కనకారావు, వీరంరెడ్డి తాతబాబు, రాజారావు పాల్గొన్నారు.

తొండంగి: అద్దరిపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఆరనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు సమక్షంలో వైసీపీకి చెందిన చేపల జగన్నాధం, ముత్తి బంగారి, చేపల రమణ,మేరుగు కోటేష్‌తో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు టీడీపలో చేరగా కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకటరమణ, రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వర్రావు, జిఎంపేట సర్పంచ్ తాటిపర్తి శ్రీను, సూరాడ రాంబాబు,చొక్కా సత్యన్నారాయణ తదితరులున్నారు.

పాదయాత్ర ప్రకటనతో హడావుడి శంకుస్థాపన



శంఖవరం: రోడ్డు పనులకు మూడోసారి శంకుస్థాపన చేస్తున్న వైసీపీ నేతలు

శంఖవరం, ఫిబ్రవరి 9: ప్రత్తిపాడు నియోజకవర్గంలో శంఖవరం నుంచి పెదమల్లాపురం రహదారి దుస్థితిపై, గిరిజనులు పడుతున్న కష్టాలపై ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ ఆధ్వర్యంలో శంఖవరం నుంచి పెదమల్లాపురం పాదయాత్ర ప్రకటించారు. ఇటీవల ఏలేశ్వరం మండలం లక్ష్మీపురం నుంచి రమణయ్యపేట వరకూ పాదయాత్ర చేశారు. దీంతో ఉలిక్కిపడిన వైసీపీ నేతలు శుక్రవారం శంఖవరం- పెదమల్లాపురం రోడ్డుకు హడావుడిగా శంకుస్థాపన చేశారు. రూ.6.6 కోట్ల ఉపాధి నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఇదే రహదారికి వరుపుల సుబ్బారావు 2సార్లు, కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మె ల్యే పర్వత ప్రసాద్‌లు ఒకసారి శంకుస్థాపన చె య్యడం విశేషం. దీంతో ప్రజల, ప్రతిపక్షాల నుంచి వస్తున్న తిరస్కారాలను తాళ్లలేక ఒత్తిళ్లతోనే ఇటువంటి ఉత్తుత్తి శంకుస్థాపనలు చేస్తున్నట్టు టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు.

రోడ్లు వేసేది ఉందా: సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లకు వైసీపీ నాయకులు కొబ్బరికాయలు కొట్టడమేనా రోడ్లను అభివృద్ధి చేసేది ఏమైనా ఉందని టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ నిలదీశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రోడ్ల విధ్వంసంపై విలేకర్లతో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ధ్వంసమైన వేళంగి రహదారికి వైసీపీ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు కొబ్బరికాయ కొట్టి మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. గతంలో వరుపుల సుబ్బారావు ఎమ్మెల్యేగా ఉండగా పలు రహదారులకు కొబ్బరికాయలు కొట్టారని, ఎంపీ వంగాగీత, ప్రస్తుత ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌లు కూడా రహదారుల నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టేందుకే పరిమితం అయ్యారన్నారు. కొబ్బరికాయలు కొట్టి ఏళ్ళు గడుస్తున్నా నియోజకవర్గంలో అనేక రోడ్లు నిర్మాణానికి నోచుకోలేదని ఆమె విమర్శించారు. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు కొబ్బరికాయలుకొట్టిన నాయకులు 15 రోజుల్లోగా రోడ్లు వేస్తే స్వాగతిస్తామని లేనిపక్షంలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

‘ఆధ్యాత్మికతత్వంతో సమస్యలు దూరం’

పిఠాపురం, ఫిబ్రవరి 9: ఆధ్యాత్మికతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా మానవుడి సమస్యలు దూరమవుతాయని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. పిఠాపురం శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగే వార్షిక మహాసభలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తూ జీవన పయనంలో మానవులు నిత్యం అనేక ఒత్తిడులు, సందేహాలు, అలజడి, అశాంతి, సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. మానవుడు తన మనస్సును ఆధ్యాత్మికపరమైన కోణంలో తీర్చిదిద్దుకోగలిగితే ఈ సమస్యలన్ని దూరమవుతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కనీసం 3 మొక్కలు నాటాలని ఆయన సూచించారు. నివేదిక 2024 గ్రంథాన్ని ఆవిష్కరించారు. సభలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, ప్రముఖ సాహితీవేత్త బేతవోలు రామబ్రహ్మం, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్య ఏ.సచ్చిదానందమూర్తి, పీఠం సభ్యులు గోపిశెట్టి అభినవ్ చంద్రక్, దొండపాటి ఉమామహేశ్వరి, ఆర్‌కే శివరామకృష్ణ, కె.సూర్యలత తదితరులు ప్రసంగించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ఏలేశ్వరం ఆర్టీసీ డిపో ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు, వారు విలువైన సూచనలు అందించేందుకు శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. ప్రయాణికుల 9959225532కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

నేడు మెగా జాబ్‌మేళా

కొత్తపల్లి, ఫిబ్రవరి 9: పిఠాపురంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వీధి చివర ఉన్న భవనంలో నిర్వహించే జాబ్‌మేళాలో 10 నుంచి పోస్ట్ గ్రాడ్యుషన్ వరకు చదువుకున్న యువతీ, యువకులు హాజరుకావచ్చని కోరారు.

12న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 9: కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈనెల 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పలు ప్రైవేటు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డీడీయుజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 77993 76333 నెంబరులో సంప్రదించాలని పీడీ తెలిపారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ప్రత్తిపాడు గ్రామ దేవత సత్తెమ్మ తల్లి 45వజాతర మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 5రోజులు పాటు మ్యాజిక్ షో, బ్రతుకు చిత్ర సాంఘిక నాటకం, కూచిపూడి నృత్య భరతనాట్య ప్రదర్శన, సినీ మ్యూజికల్ నైట్, అమ్మవారి పూల గరగల సంబరం ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

‘గిరిజనుల సమస్యలపై చిన్నచూపు’

శంఖవరం, ఫిబ్రవరి 9: గిరిజనుల సమస్యలపై రాష్ట్రప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గంటా బాలుదొర విమర్శించారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా పెదమల్లాపురంలో గ్రామస్తులకు కేంద్రప్రభుత్వ పథకాలను వివరించారు. ఇక్కడ వాల్మీకి కులస్థులు కులధ్రువీకరణ పత్రాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందన్నారు.

ఏలేశ్వరంలో ‘పల్లెకు పోదాం’

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శుక్రవారం ఏలేశ్వరంలోని 7వ వార్డులో ప్రారంభించారు. బీజేపీ జిల్లా నాయకులు కొల్లా శ్రీనివాస్, వెలుగూరి హరేరాం, రెడ్డి లోవరాజు, కూరాకుల రాజా, గట్టెం వెంకటరమణ, ఏనుగు ధర్మరాజు, గంగాధర్, దుర్గ పాల్గొని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు.

పేరవరంలో ఎంఈవో తనిఖీ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ఏలేశ్వరం మండలం పేరవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అబ్బాయి తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేశారు. విద్యార్థుల బోధనా సామాగ్రి పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.సుందర్రావు, సత్యవేణి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బాలరాజు తదితరులున్నారు.

పంతం నానాజీ హర్షం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న అవార్డు రావడం పట్ల జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ హర్షం వ్యక్తం చేశారు. రాజకీయంగా దేశం ఎంతో సంక్లిష్టంలో ఉన్న సమయంలో దక్షిణాది, ఏపీకి చెందిన తెలుగువాడు పీవీ నరసింహారావు ప్రధాని పదవి చేపట్టి విజయవంతంగా పాలన అందించారన్నారు. ప్రతిష్టాత్మక భారత రత్న అవార్డును పీవీకి ప్రకటించిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిత్య 2కే24 పోస్టర్ ఆవిష్కరణ

గండేపల్లి, ఫిబ్రవరి 9: ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఈనెల 23, 24న నిర్వహించే ఆదిత్య 2కే24 పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. మార్కెటింగ్, హెచ్‌ఆర్, బిజినెస్ క్విజ్ యంగ్ మేనేజర్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి నగదు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ భార్గవి, విభాగాధిపతి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆట వస్తువుల అందజేత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: ఏలేశ్వరం భవితా కేంద్రంలోని చిన్నారులకు సామంతుల సాత్విక్ జ్ఞాపకార్థంగా తండ్రి భాస్కరరావు శుక్రవారం ఆట వస్తువులు,ప్రూటీలు, స్వీట్లు అందజేశారు. కొప్పుల ఇందిర జన్మదిన సందర్భంగా కుట్టుమిషన్ సామాగ్రిని పంపిణీ చేశారు. కటకం కిరీటి, భవితా కేంద్ర టీచర్లు చింతా పద్మజ, పి. బుజ్జి, కోరాడ రాజు పాల్గొన్నారు.